**తరగతి గదిలోనే గుండెపోటు..**
**బోధిస్తూనే కన్నుమూసిన గురువు**

- మహబూబాబాద్ జిల్లాలో విషాదం..
- ఉపాధ్యాయుడు శంకర్ ఆకస్మిక మృతి

05



**'తెలంగాణ రాజకీయ కూటమి' ఆవిర్భావం**

- ప్రధాన పార్టీలకు ప్రత్యామ్నాయంగా కొత్త అలయెన్స్
- జీహెచ్ఎంసీ, స్థానిక ఎన్నికల్లో పోటీకి.. సై
- రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం

03




సంపుటి :02 | సంచిక :313 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

శనివారం 21, ఫిబ్రవరి 2026

వెల ₹5


**మీరు పోలీసింగ్‌లో భాగస్వాములవుతారా?**

- అయితే.. విద్యార్థులూ ఈ వార్త మీకోసమే!
- హైదరాబాద్ సిటీ పోలీసుల వినూత్న ఆలోచన
- ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం
- శిక్షణ తర్వాత సర్టిఫికెట్లు అందజేత

05






# మావోయిజానికి ఇక మనుగడ లేదు

## అగ్రనేత సోనూ దాదా సంచలన వ్యాఖ్యలు

దశాబ్దాల పాటు దండకారణ్యాన్ని ఉర్రూతలూగించిన ఎర్రజెండా రెపరెపలు ఇక ఆగిపోనున్నాయా? తుపాకీ గొట్టం ద్వారా విప్లవం వస్తుందన్న కల కరిగిపోతోందా? అంటే.. అవుననే సమాధానం ఇస్తున్నారు మావోయిస్టు పార్టీ మాజీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోనూ దాదా. ప్రస్తుత పరిస్థితుల్లో మావోయిస్టు ఉద్యమానికి ఇక మనుగడ లేదని, అడవిలో విప్లవ స్ఫూర్తి చచ్చిపోయిందని ఆయన బాంబు పేల్చారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆయన చేసిన వ్యాఖ్యలు అటు పోలీసు వర్గాల్లో, ఇటు ఉద్యమ శ్రేణుల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. పార్టీలో ఉన్న వారంతా వృద్ధులైపోయారని, కొత్త రక్తం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రనేతలు దేవ్‌జీ, మల్ల రాజిరెడ్డి వంటి వారు త్వరలోనే అజ్ఞాతాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలుస్తారని, మార్చి 31 లోపు మెజారిటీ మావోయిస్టులు ఆయుధాలు వీడతారని ఆయన వెల్లడించారు. ప్రజలు కోరుకుంటే తాను రాజకీయాల్లోకి వచ్చేందుకు సిద్ధమని తన మనసులోని మాటను బయటపెట్టారు.

\- అక్షర దర్బార్, ప్రధాన ప్రతినిధి

- సిద్ధాంతం ముసలిదైపోయింది.. కొత్త రక్తం కరువు
- దేవ్‌జీ, మల్ల రాజిరెడ్డి అజ్ఞాతం వీడటం ఖాయం!
- మార్చి 31లోగా లొంగుబాట్లు..
- రాజకీయాల్లోకి వస్తా : మల్లోజుల వేణుగోపాల్

03



**గొప్ప మహనీయుడు**
# సేవాలాల్

- అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- కాశీబుగ్గలో వైభవంగా సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు
- బంజారా మహిళలతో కలిసి అడుగులు వేసిన మంత్రి

02

**కన్నవారిని కాదని.. కొలువు చేస్తామంటే కుదరదు!**

- తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో కోత
- ఏకంగా 10 నుంచి 15 శాతం కట్ చేసి నేరుగా కన్నవారి ఖాతాల్లోకే..
- అస్సాం 'ప్రణామ్' చట్టం తరహాలో తెలంగాణ సర్కార్ సరికొత్త నిర్ణయం
- ఎల్లుండి క్యాబినెట్ భేటీలో ముసాయిదాపై చర్చ..
- త్వరలోనే చట్టబద్ధత

05

**'ఆపరేషన్ కగార్-2'లో వెనకడుగు వేయం**

- మార్చి 31 నాటికి మావోయిస్టు విముక్త భారత్
- మరోసారి ఉద్ఘాటించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా

05

- మార్చి మొదటి వారం నుంచి కొత్త ఆఫీసు కార్యకలాపాలు షురూ
- అలాగే.. మున్సిపల్ రీజినల్ కార్యాలయమూ ఈ క్షేత్రంలోకే
- సర్కార్ నిర్ణయంపై కవులు, కళాకారులు, కళాభిమానుల విమర్శలు
- కళలు, సాంస్కృతిక వేదికలో ఆఫీసులేంటని నిలదీత

**కాళోజీ కళాక్షేత్రంలోకి**
# కుడా

- పాత కార్యాలయాన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీలకు లీజు
- తద్వారా స్థానిక యువతకు ఉపాధి కల్పన సర్కార్ లక్ష్యం

02





## కాళోజీ కళాక్షేత్రంలోకి

# 'కుడా' ఆఫీస్

- పాత కార్యాలయాన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీలకు లీజు
- తద్వారా స్థానిక యువతకు ఉపాధి కల్పన సర్కార్ లక్ష్యం
- మార్చి మొదటి వారం నుంచి కొత్త ఆఫీసు కార్యకలాపాలు షురూ
- అలాగే.. మున్సిపల్ రీజినల్ కార్యాలయమూ ఈ క్షేత్రంలోకే
- సర్కార్ నిర్ణయంపై కవులు, సర్వత్రా విమర్శలు
- కళలు, సాంస్కృతిక వేదికలో ఆఫీసులేంటని నిలదీత
- ఏది ఏమైనా.. ఆఫీసుల తరలింపు ఆగదన్నట్లు యంత్రాంగం ఏర్పాట్లు

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి:**

కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) తన కార్యాలయాన్ని వరంగల్‌లోని కాళోజీ కళా క్షేత్రంలోకి యంత్రాంగం చకచకా ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో భాగంగానే నెల రోజుల నుంచి కళాక్షేత్రంలో కార్యాలయ ఇంటీరియర్ పనులు జరుగుతున్నాయి. అధికారులు స్వయంగా దగ్గరుండి ఆ పనులను పర్యవేక్షిస్తున్నారు. మరో 15 రోజుల్లోగా తరలింపు ప్రక్రియను పూర్తి చేసి, కొత్త భవనంలో కార్యకలాపాలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కుడాతో పాటు మున్సిపల్ ఆర్డీ కార్యాలయం కూడా అక్కడికే మారే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న కుడా కార్యాలయాన్ని ఖాళీ చేయడానికి ప్రధాన కారణం.. ఆ భవనాన్ని కొన్ని సాఫ్ట్‌వేర్ సంస్థలకు లీజుకు ఇచ్చి, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇప్పటికే ఒకసారి టెండర్లు పిలిచినా స్పందన లేదు. దీంతో మళ్లీ కొత్తగా టెండర్లు పిలిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వారం రోజుల్లో కొత్త నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉంది.

### - కార్యాలయ తరలింపుపై విమర్శలు

మరోవైపు కుడా కార్యాలయం తరలింపుపై నగరంలో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాకవి కాళోజీ నారాయణరావు స్మారకార్థం నిర్మించిన ఈ కళాక్షేత్రం కళలు, సంస్కృతికి వేదికగా ఉండాలే కానీ, ప్రభుత్వ కార్యాలయాలు తీసుకురావడం ఏంటని కవులు, కళాకారులు, కళాభిమానులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కళలకు నెలవుగా ఉండాల్సిన చోట ఫైళ్లు, ఆఫీసు గోల ఏంటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల కేరాఫ్ అడ్రస్‌గా కళాక్షేత్రాన్ని మార్చడం సరైన నిర్ణయం కాదని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎన్ని విమర్శలు వస్తున్నా అధికారులు మాత్రం తరలింపు పనుల్లోనే నిమగ్నమై ఉన్నారు.

### - తరలింపు గడువు ఖరారు

కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయాన్ని మరో రెండు వారాల్లో పూర్తిగా కాళోజీ కళాక్షేత్రంలోకి మార్చేందుకు అధికారులు ముహూర్తం ఖరారు చేశారు. ఫిబ్రవరి చివరి నాటికి పాత కార్యాలయంలో ఫైళ్ల సర్దుబాటు పూర్తి చేసి, మార్చి మొదటి వారం నుంచి కొత్త భవనంలో కార్యకలాపాలు ప్రారంభించాలని భావిస్తున్నారు. ఇందుకు తగ్గట్టుగానే కళాక్షేత్రం లోపల విభాగాల వారీగా క్యాబిన్ల నిర్మాణం, కంప్యూటర్ నెట్‌వర్కింగ్ పనులు తుది దశకు చేరుకున్నాయి. కేవలం కుడ మాత్రమే కాకుండా, మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ కార్యాలయం కూడా కాళోజీ కళాక్షేత్రంలోకే మారనుంది. ఇందుకు సంబంధించి మున్సిపల్ ఆర్‌డీ షాహిద్ మసూద్ ఇప్పటికే కుడా వైస్ చైర్మన్ చాహత్ బాజ్‌పాయ్‌ని కలిసి విన్నవించారు. దీనికి అధికారులు సానుకూలంగా స్పందించడంతో, కళాక్షేత్రంలో ఒక పెద్ద భాగం ప్రభుత్వ కార్యాలయాల సముదాయంగా మారబోతోంది. దీనివల్ల సామాన్య ప్రజలు తమ పనుల కోసం కళాక్షేత్రం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.

### - ప్రైవేట్ సంస్థల కోసం కొత్త టెండర్లు

పాత కుడా భవనాన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీలకు అప్పగించే ప్రక్రియలో భాగంగా అధికారులు రెండోసారి టెండర్లు పిలిచేందుకు సిద్ధమయ్యారు. గతంలో వచ్చిన స్పందన తక్కువగా ఉండటంతో, ఈసారి మరిన్ని రాయితీలు లేక సౌకర్యాలతో ఐటీ సంస్థలను ఆకర్షించాలని చూస్తున్నారు. వారం రోజుల్లోగా ఈ కొత్త టెండర్ నోటిఫికేషన్ విడుదల కానుంది. హన్మకొండ నడిబొడ్డున ఉన్న ఈ భవనాన్ని ఒక ఐటీ హబ్‌గా మార్చాలన్నది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. అధికారులు పనులు వేగవంతం చేస్తున్నా, మరోవైపు ప్రజా సంఘాలు, కళాకారుల నుండి నిరసనలు తీవ్రమవుతున్నాయి. "కళాక్షేత్రాన్ని కార్యాలయాలకు ఇవ్వడం అంటే కాళోజీ ఆశయాలను అవమానించడమే" అని వారు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా కూడా ఈ తరలింపుపై చర్చ జరుగుతోంది. విమర్శలు వస్తున్నప్పటికీ, ఐటీ అభివృద్ధి, పరిపాలనా సౌలభ్యం పేరుతో ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడం లేదని స్పష్టమవుతోంది.



## కొత్త స్టోన్ క్రషర్ ఏర్పాటుకు

# అనుమతివ్వొద్దు

- బ్లాస్టింగ్ మూలంగా దుమ్ము ధూళిలతో పంట పొలాలు నాశనం
- ఇల్లు పగుళ్లు ఏర్పడి, భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం
- ఎట్టి పరిస్థితుల్లో అనుమతించొద్దని సర్పంచ్ కు గ్రామస్తుల వినతి

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం పత్తిపాక గ్రామంలో పెద్దగుట్టకు కొత్తగా స్టోన్ క్రషర్ ఏర్పాటు చేసే కుట్ర జరుగుతుందని, స్టోన్ క్రషర్ కి ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని గ్రామస్తులు గ్రామ సర్పంచ్ గజ్జి ఐలయ్య కు వినతి పత్రం అందజేశారు.గ్రామంలో గతంలో స్టోన్ క్రషర్ ఏర్పాటు చేసి వాటి బ్లాస్టింగ్ మూలంగా దుమ్ము ధూళిలతో పంట పొలాలు నాశనం అయ్యాయని, ఇల్లు పగుళ్లు ఏర్పడ్డాయని, అంతేకాకుండా భూగర్భ జలాలు అడుగంటి పోయి ప్రకృతి మొత్తం ధ్వంసం అయి గ్రామం కాలుష్యంతో కొట్టుమిట్టాడుతుందని తెలిపారు.ఇప్పటికే గ్రామం ప్రమాదం అంచులో ఉందని అన్నారు.ఇదే సందర్భంలో ఇప్పుడు మరొక కొత్త స్టోన్ క్రషర్ ఏర్పాటు చేసే కుట్ర జరుగుతుందని దీని ఏర్పాటు కు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని గ్రామస్తులు సర్పంచ్ కు తెలియజేశారు.పచ్చని ప్రకృతి వనరులు గుట్టలు విధ్వంసం కాకుండా బాధ్యతాయుతంగా చర్యలు తీసుకొని గ్రామాన్ని సస్యశ్యామలంగా ఉండే విధంగా చొరవ తీసుకోవాలని సర్పంచ్ కి వివరించారు.ఎవరు ఎన్ని కుట్రలు చేసినా గ్రామంలో స్టోన్ క్రషర్ ఏర్పాటు చేయాలని చూస్తే ఊరుకోమని గ్రామ వనరుల సంక్షేమం కోసం పోరాడుతామని గ్రామస్తులు అన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ గజ్జి ఐలయ్య, ఉప సర్పంచ్ తుడుం రాజు ఇతర వార్డు సభ్యులు నూతన క్రషర్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వమని ప్రజా శ్రేయస్సు కోసం పని చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో పత్తిపాక గ్రామం వాస్తవ్యుడైన బహుజన సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మొగ్గం సుమన్, పరుమాండ్ల సురేష్ తిరుపతి రెడ్డి, సాంబ రెడ్డి, రాజేంద్రప్రసాద్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# గొప్ప మహనీయుడు సేవాలాల్

- అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- కాశీబుగ్గలో వైభవంగా సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు
- బంజారా మహిళలతో కలిసి అడుగులు వేసిన మంత్రి

**అక్షరదర్బార్, వరంగల్:**

పీడిత వర్గాల సమానత్వం కోసం, సమాజంలోని అసమానతల తొలగింపు కోసం కృషి చేసిన గొప్ప మహనీయుడు సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ అని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ కొనియాడారు. వరంగల్ 19వ డివిజన్ కాశీబుగ్గలో ఏర్పాటు చేసిన సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాల్లో శనివారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమ ప్రారంభంలో మంత్రి సేవాలాల్ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బంజారా సంప్రదాయం ప్రకారం డోలు వాయించి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బంజారా మహిళల కోరిక మేరకు వారితో కలిసి మంత్రి సురేఖ ఉత్సాహంగా నృత్యం చేయడం అక్కడి వారిని విశేషంగా ఆకట్టుకుంది.

### - బంజారా సంక్షేమానికి ప్రభుత్వ కట్టుబాటు

బంజారా బిడ్డల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. నగరంలో బంజారాల కోసం సంత్ సేవాలాల్ ఆలయం, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి జిల్లా కలెక్టర్, మేయర్‌లతో చర్చించి అవసరమైన స్థలం, నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఖమ్మం రోడ్డు ప్రాంతంలో గతంలో చోరీకి గురైన సేవాలాల్ విగ్రహం కేసులో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న ఏసీపీని ఆదేశించారు. అర్హులైన గిరిజనులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపును పరిశీలిస్తామని వెల్లడించారు.



### - గౌరవ వందనం

నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ, సేవాలాల్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. బంజారా ప్రతినిధులు మంత్రికి, మేయర్‌కు, అధికారులకు సంప్రదాయ తలపాగాలను ధరింపజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పోశాల పద్మ, ఓని స్వర్ణలత భాస్కర్, వస్కుల బాబు, బాల్నే సురేష్, చింతాకుల అనిల్ కుమార్, ఆర్‌డీఓ సుమ, ఏసీపీ శుభం, ట్రైనీ ఐపీఎస్ మనీషా, తహసీల్దార్ శ్రీకాంత్, బంజారా ప్రతినిధులు మోతీ నాయక్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# 'తెలంగాణ రాజకీయ కూటమి' ఆవిర్భావం

- ప్రధాన పార్టీలకు ప్రత్యామ్నాయంగా కొత్త అలయెన్స్
- జీహెచ్ఎంసీ, స్థానిక ఎన్నికల్లో పోటీ..
- రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం



అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త సమీకరణాలు మొదలయ్యాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ వంటి ప్రధాన పార్టీలకు గట్టి పోటీ ఇచ్చేలా ఒక ప్రత్యామ్నాయ కూటమి రంగంలోకి వచ్చింది. 'తెలంగాణ రాజకీయ కూటమి' పేరుతో శనివారం కొందరు ఈ వేదిక ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో కూటమి ప్రతినిధులు తమ భవిష్యత్ ప్రణాళికను ప్రకటించారు. రాష్ట్రంలోని ప్రధాన పార్టీల తీరుపై ప్రజలు విరక్తి చెందారని వక్తలు అభిప్రాయపడ్డారు. రాబోయే జీహెచ్ఎంసీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ కూటమి కీలక పాత్ర పోషించనుంది. మార్క్సిస్ట్–లెనినిస్ట్ సిద్ధాంతాల పట్ల సానుకూలత ఉన్న వారితో పాటు విద్యార్థి, రిటైర్డ్ ఉద్యోగ సంఘాలను ఏకం చేయడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. కేవలం పోరాటాలకే పరిమితం కాకుండా రాజ్యాధికారమే ధ్యేయంగా ముందుకు సాగాలని నిర్ణయించారు. తెలంగాణకు ఒక ప్రత్యేక రాజకీయ ఫిలాసఫీ అవసరమని తెలంగాణ విఠల్ పేర్కొన్నారు. ప్రధాన పార్టీలకు సిద్ధాంతాలు, మేనిఫెస్టోలు ఏవీ లేవని ఆయన విమర్శించారు. రాజకీయ అనుభవం లేని కన్సల్టెంట్ల చేతుల్లో పార్టీలు బందీ అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం జరగాలంటే సొంతంగా ఎదగాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. మేధావులు, రచయితలు, కళాకారులు ఇతర పార్టీల కోసం పని చేయకూడదని సమావేశం తీర్మానించింది. మన అస్తిత్వం కోసం మనమే డప్పు కొట్టుకోవాలని వక్తలు సూచించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ లక్ష్మణ్, ప్రొఫెసర్ గాలి వినోద్, కపిలవాయి దిలీప్ కుమార్, శరత్ తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ నిర్మాణాల కూల్చివేత

## - కేసముద్రం మున్సిపల్ అధికారుల దూకుడు

అక్షరదర్బార్, మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలపై శనివారం అధికారులు ఉక్కుపాదం మోపారు. పట్టణంలోని జ్యోతిబా పూలే సెంటర్ వద్ద అనుమతులు లేకుండా చేపట్టిన భవన నిర్మాణాన్ని మున్సిపల్ సిబ్బంది అడ్డుకున్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జేసీబీతో అక్రమ కట్టడాలను కూల్చివేసేందుకు చర్యలు చేపట్టారు. ఒక అంతస్తు నిర్మాణం పూర్తి చేసి రెండో అంతస్తు పనులు మొదలుపెట్టడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. అధికారుల రాకతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిర్మాణ సామాగ్రి పాడవుతుందని, వాటిని తొలగించుకోవడానికి సమయం కావాలని మేస్త్రీ వేడుకోవడంతో అధికారులు రెండు రోజుల గడువు ఇచ్చారు. మరోవైపు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జికి ఇరువైపులా జరుగుతున్న అక్రమ కట్టడాలపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వం నుంచి పరిహారం పొందిన కొందరు యజమానులు హద్దులు దాటి నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. రోడ్డుకు అవసరమైన స్థలాన్ని వదిలిపెట్టకుండా అక్రమంగా ముందుకు వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. వివక్ష చూపకుండా అన్ని అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# మావోయిస్టు ఉద్యమానికి మనుగడ లేదు

- అగ్రనేతలు దేవ్ జీ, లొంగిపోతారు!
- మావోయిస్టు పార్టీ మాజీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్



అక్షరదర్బార్, హైదరాబాద్ : ప్రస్తుత పరిస్థితుల్లో మావోయిస్టు ఉద్యమానికి మనుగడ లేదని మావోయిస్టు పార్టీ మాజీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఆయన ఒక తెలుగు న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఉద్యమంలో ఉన్న వారంతా వృద్ధులైపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలోకి కొత్త రక్తం రావడం లేదని గుర్తు చేశారు. చైనా, రష్యా దేశాల పాత సిద్ధాంతాలతో ఉనికిని కాపాడుకోవడం సాధ్యం కాదని వేణుగోపాల్ అభిప్రాయపడ్డారు. తనను ద్రోహి అని విమర్శిస్తున్న వారికి కాలమే సమాధానం చెబుతుందని అన్నారు. తాను ఎప్పుడూ ప్రజలతోనే ఉంటానని స్పష్టం చేశారు. ప్రజలు కోరుకుంటే భవిష్యత్తులో రాజకీయ బాట పట్టేందుకు సిద్ధమని ప్రకటించారు. తన సహచరులు కూడా త్వరలోనే మంచి నిర్ణయం తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా అగ్రనేతలు దేవ్ జీ, మల్ల రాజిరెడ్డి త్వరలోనే అజ్ఞాతం వీడతారని వెల్లడించారు. మిగిలిన వారు కూడా మార్చి 31లోగా తుపాకులు వీడతారని ఆశిస్తున్నట్లు చెప్పారు. లొంగిపోయే ముందు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ముందు కొన్ని డిమాండ్లు పెట్టామని వివరించారు. వాటిని అమలు చేసేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు. అడవిలో సోనూ దాదాగా తాను సాధించిన విజయాలు ప్రజల మధ్యకు వెళ్తే తెలుస్తాయని చెప్పారు. తల్లిగడ్డ తెలంగాణకు త్వరలోనే వస్తానని మల్లోజుల వేణుగోపాల్ ప్రకటించారు. 1980 నాటి పరిస్థితులకు ఇప్పటి తెలంగాణకు చాలా తేడా ఉందని గుర్తించారు. నాటి ఉద్యమ స్ఫూర్తిని తిరిగి తీసుకురాలేకపోయామని అంగీకరించారు. ఆదివాసీల సంక్షేమం కోసం తాము చేసిన కృషిని వారిని అడిగితే చెబుతారని అన్నారు. అర్బన్ మావోయిజం అనేది కేవలం ప్రచారమే తప్ప వాస్తవంలో లేదని కొట్టిపారేశారు.

# నెలాఖరు వరకు పత్తి కొనుగోలు

- గడువు పొడిగించిన కేంద్ర జౌళీశాఖ
- సత్ఫలితమిచ్చిన వ్యవసాయ మంత్రి తుమ్మల లేఖ



అక్షరదర్బార్ , వరంగల్ : తెలంగాణకు చెందిన పత్తి రైతులకు శుభవార్త. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లను ఈ నెలాఖరు వరకు కొనసాగించాలని శనివారం భారత పత్తి సంస్థ (సీసీఐ) నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికిఊ కేంద్రం సానుకూలంగా స్పందించింది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో కొనుగోలు గడువు పెరిగింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి నిన్న కేంద్ర జౌళీశాఖ జాయింట్ సెక్రటరీకి లేఖ రాశారు. పత్తి సేకరణ గడువును పొడిగించాలని ఆ లేఖలో కోరారు. మంత్రి తుమ్మల ఇప్పటికే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో ఈ విషయంపై చర్చించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని గడువు పెంచాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం, సీసీఐ తీసుకున్న తాజా నిర్ణయంపై మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. గడువు ముగియక ముందే రైతులు తమ పత్తిని విక్రయించుకోవాలని సూచించారు. అధికారులు కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వేలాది మంది రైతులకు మేలు జరుగుతుంది.



# కాంగ్రెస్ లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్

## పార్టీలోకి ఆహ్వానించిన పరకాల ఎమ్మెల్యే రేవూరి

అక్షరదర్బార్,పరకాల: పరకాల మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ టికెట్‌పై గెలిచిన ఐదో వార్డ్ కౌన్సిలర్ గౌడుగు రజిత కాంగ్రెస్ పార్టీలో చేరారు. గెలిచిన అనంతరం బీఆర్ఎస్ కౌన్సిలర్లతో ప్రమాణ స్వీకారం చేయకపోవడం పలు అనుమానాలకు దారితీసిన నేపథ్యంలో, శనివారం సాయంత్రం పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆమెకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కౌన్సిలర్‌తో పాటు కాలనీకి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

## బాలికల ప్రాథమిక పాఠశాలలో 'స్వయం పరిపాలన'

అక్షర దర్బార్, మహబూబాబాద్: పట్టణంలోని మండల పరిషత్ బాలికల ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల వలె ముస్తాబై పాఠశాల నిర్వహణ బాధ్యతలను స్వీకరించారు. డీఈఓగా విరాట్, ప్రధానోపాధ్యాయురాలిగా అశ్విత బాధ్యతలు చేపట్టి తరగతులను సమర్థంగా నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. ఇతర విద్యార్థులు పీఈటీ, అటెండర్ పాత్రల్లో పరకాయ ప్రవేశం చేసి క్రమశిక్షణతో పాఠశాలను నడిపించారు. ఈ సందర్భంగా హెచ్ఎం భూక్యా రాంజీ నాయక్ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతా భావం మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థులు ప్రతిభను చాటుకోవడానికి ఇదొక మంచి వేదిక అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిషన్, సత్యవతి, వరలక్ష్మి, నాగముని, లక్ష్మి, చామంతి, సృజన తదితరులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.



www.aksharadarbar.com
అక్షర దర్బార్
Voice of the people



# హామీల అమలు అభినందనీయం

అక్షర దర్బార్ శాయంపేట : తెలంగాణ ఉద్యమకారులకు మేనిఫెస్టోలో ఇచ్చినటువంటి హామీలు 250 గజాలు ఇంటి స్థలం,గౌరవ పెన్షన్ ఇతర హామీలను నెరవేర్చే దిశగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, తెలంగాణ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ కృషి చేస్తున్నారని వారికి శాయంపేట మండల కేంద్రంలోని హనుమకొండ జిల్లా అధ్యక్షులు పొడి శెట్టి గణేష్ ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గిద్దమారి సురేష్,పల్లె బోయిన సారయ్య,బాసాని విద్యాసాగర్, గిద్దమారి రామన్న,యూత్ జిల్లా అధ్యక్షులు కొమ్ముల శివ, మండల యూత్ అధ్యక్షులు ముంజల నాగరాజు, మండల ఉపాధ్యక్షులు ఎండి రఫీ,కోశాధికారి కానుగుల నాగరాజు,టౌన్ ప్రెసిడెంట్ రంగు మహేందర్,నమిత భాజ్ అశోక్,రాజ్ మహమ్మద్, తుమ్మ ప్రభాకర్,అరికెళ్ల వీరయ్య, మైలారం గ్రామ ఉద్యమకారుల అధ్యక్షుడు దూదిపాల జోగిరెడ్డి , జూపాక సారయ్య తదితరులు పాల్గొన్నారు.



# నల్లెల కుమార్ కు నివాళి..

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: ములుగు జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు స్వర్గీయ నల్లెల కుమారస్వామి 3వ వర్ధంతి కార్యక్రమం ఏర్పాటు చేయగా తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కుంజ సూర్య విచ్చేసి నల్లెల కుమార స్వామి చిత్ర పటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గోవిందరావుపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చింత క్రాంతి, ఏటూరు నాగారం మండల యూత్ అధ్యక్షులు , రామన్నగూడెం సర్పంచ్ గద్దల నవీన్, తదితరులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు

# మాతృభాష అమృత భాష కావాలి

## చర్లపల్లి పాఠశాలలో ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పల్లె శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ.. భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21ను ప్రపంచవ్యాప్తంగా మాతృభాషా దినోత్సవంగా జరుపుకుంటున్నారని తెలిపారు. మాతృభాష మృతభాష కాకుండా అమృతభాషగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయనను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లకావత్ దేవ, కంచ రాజకుమార్, పుల్లూరి రామకృష్ణ, అంగన్వాడీ టీచర్ భీముడి లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులకు శుభాకాంక్షలు



అక్షర దర్బార్, నర్సంపేట: నర్సంపేటకు చెందిన కాంగ్రెస్ నేత శ్రీరామోజు రమేష్-సంధ్యారాణి దంపతుల కూతురు వందన-నిఖిల్ వివాహ వేడుకలకు నర్సంపేట మున్సిపల్ చైర్పర్సన్ శ్రీలక్ష్మీరామానంద హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట కౌన్సిలర్లు మాదాసి రవి, బీరం భరత్ రెడ్డి, శ్రీరామోజు రోజారాణి, నర్సంపేట నియోజక వర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతకింది శివకృష్ణ, కొర్ర రాహుల్, భూక్య గణేష్, కాగితపు విష్ణు, గద్ద అఖిల్, ఓదెల ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని అడ్డుకోవడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమా?

## బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్



అక్షరదర్బార్, పరకాల: దేశ అభివృద్ధి కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పటికప్పుడు అడ్డంకులు సృష్టిస్తోందని బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆరోపించారు. ఢిల్లీలో జరుగుతున్న ఇండియా–ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ప్రదర్శించిన వైఖరిని ఆయన ఖండించారు.అభివృద్ధిని అడ్డుకోవడమే కాంగ్రెస్ పార్టీ మనస్తత్వమని, అంతర్జాతీయ వేదికల్లో దేశ ప్రతిభను ప్రతిబింబించాల్సిన సమయంలో ఇలాంటి చర్యలు దేశ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నాయని విమర్శించారు. గ్లోబల్ సమ్మిట్‌లు జాతీయ ఐక్యతకు వేదికలుగా నిలవాల్సి ఉండగా, కాంగ్రెస్ కార్యకర్తల ప్రవర్తన ఆ లక్ష్యానికి విరుద్ధమని అన్నారు. దేశ ప్రయోజనాలను ముందుంచుకుని అన్ని రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేయాలని, అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని గాజుల నిరంజన్ పిలుపునిచ్చారు.

# గాంధీ నగర్ లో వైద్య శిబిరం

ప్రారంభించిన సర్పంచ్ బానోత్ నిర్మల వెంకన్న

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: గోవిందరావుపేట మండలం గాంధీనగర్ గ్రామంలో ఇషా కేర్ హాస్పిటల్ సహకారంతో గాంధీనగర్ గ్రామంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. శిబిరాన్ని సర్పంచ్ బానోతు నిర్మల వెంకన్న ప్రారంభించి మాట్లాడుతూ.. మారుమూల గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి ప్రజలకు ఉచిత వైద్యం అందించడానికి ముందుకు వచ్చిన ఇషా కేర్ హాస్పిటల్ యాజమాన్యానికి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. సుమారు 160 మంది రోగులను వైద్యులు పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వల్లపు మహేష్, వార్డు సభ్యులు తేజవత్ హుని లకావత్ ఈర్య, కూరాకుల సురేష్, మాలోత్ శంకర్ కార్యదర్శి భారతి ఇషా కేర్ డాక్టర్, ప్రేమ్ సింగ్ వేణు సిబ్బంది పాల్గొన్నారు



# మహేశ్వరంలో ఆర్టీసీ బస్సులకు హాల్టింగ్ ఇవ్వాలి

## డిపో మేనేజర్ ప్రసూనా లక్ష్మికి వినతిపత్రం సమర్పణ

అక్షర దర్బార్, నర్సంపేట: నర్సంపేట విలీన గ్రామం మహేశ్వరంలో ప్రతి ఒక్క ఆర్టీసీ బస్సు హాల్టింగ్ ఇవ్వాలని డిపో మేనేజర్ ప్రసూనా లక్ష్మికి శనివారం గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో చాలా మంది ఉద్యోగం,విద్యా,వైద్య నిమిత్తం హన్మకొండ, హైదరాబాద్ కి వెళ్తుంటారు. ఆర్టీసీ బస్సులకు హాల్టింగ్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించి సమస్యకి పరిష్కారం చూపించి అన్ని బస్సులు ఆపే దిశగా చూస్తా అని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందచేసిన వారిలో కౌన్సిలర్లు మాత్య రాథోడ్,భూస శిరీష-రాజు,గ్రామస్తులు చెన్న భాస్కర్,బేతం అఖిల్,చిదురాల చక్రపాణి ,మోర్తాల రాజు,బొల్ల శ్రీకాంత్, చెన్న గణేష్,చేరాల ప్రదీప్,భూక్య సాయి కళ్యాణ్ పాల్గొన్నారు..



# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## శాయంపేట ఎస్సై జె.పరమేశ్వర్



అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం పత్తిపాక గ్రామంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో ఆర్థిక ,అక్షరాస్యత కేంద్రం, ఆధ్వర్యంలో సైబర్ నేరాల పట్ల మరియు ఆర్థిక క్రమశిక్షణ పట్ల అవగాహన కార్యక్రమాన్ని మారపల్లి క్రాంతి కుమార్ సి ఎఫ్ ఎల్ కౌన్సిలర్ అధ్యక్షత నిర్వహించగా ముఖ్య అతిథులుగా ఎస్ ఐ జె.పరమేశ్వర్ హాజరైనారు.అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వీడియోల ద్వారా, మరియు ఆన్లైన్ మోసాలు రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోయాయి.ఏది నిజం ఏది అబద్ధం అని తెలుసుకోలేక ప్రజలు అయోమయంలో ఉంటున్నారు.వీటికి తోడుగా వాట్సాప్ గ్రూప్ లలో వచ్చే అపరిచిత లింకుల ద్వారా ఉచితంగా డబ్బులను సంపాదించవచ్చని మెసేజ్ లు రావడంతో వాటి ఆ లింకులను ఓపెన్ చేసి నష్టపోయిన వారు ఉన్నారు.అదేవిధంగా ఎటువంటి పూచి కత్తు లేకుండా లోన్స్ ఇస్తామని ఈ లింకులను ఓపెన్ చేయండి అని అనడంతో ఈ విధంగా కూడా చాలామంది నష్టపోయినారు.అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు చెప్పడం, అనధికార లింకులను ఓపెన్ చేయడం వల్ల సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి.అంతేకాకుండా ఫోన్ పే లేదా గూగుల్ పే ద్వారా మనకు డబ్బులు పంపించి, మనకు డబ్బులు పడినట్టు మెసేజ్ లు కూడా వచ్చి ఆ డబ్బులు పొరపాటున మీకు వచ్చాయి.దయచేసి మా ఈ నెంబర్ కి తిరిగి పంపండి అని అనడంతో, అలా పంపించడం ద్వారా కూడా చాలామంది డబ్బులు పోగొట్టుకున్న వారు ఉన్నారు.కాబట్టి వీటన్నింటి నుండి జాగ్రత్త పడాలంటే అపరిచిత వ్యక్తులు పంపించిన లింకులను ఓపెన్ చేయవద్దు. ఓటిపి ఎవరికీ చెప్పవద్దు, లింకుల ద్వారా ఎవరికీ డబ్బులు పంపించవద్దని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గజ్జి ఐలయ్య,ఉప సర్పంచ్ రాజు, కుమారస్వామి, మారపల్లి విజయ్ పాల్గొన్నారు.

# అగ్రికల్చర్ ఏడీ ఆస్తులు

# రూ. 50 కోట్లు!

- ఏకకాలంలో ఏడు చోట్ల ఏసీబీ దాడులు
- 100 ఎకరాల భూమి, 10 ప్లాట్లు, కార్లు, ట్రాక్టర్లు గుర్తింపు
- కళ్లు చెదిరే ఆస్తులు చూసి అధికారులు షాక్



అక్షర దర్బార్ , ప్రధాన ప్రతినిధి : అక్రమార్కులపై ఏసీబీ పంజా విసిరింది. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) సుందరి కిరణ్ కుమార్ ఇల్లు, కార్యాలయాలతో పాటు మరో ఆరు చోట్ల ఏసీబీ అధికారులు శుక్రవారం ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో ఆయన సంపాదించిన అక్రమ ఆస్తుల చిట్టా చూసి అధికారులు సైతం విస్తుపోయారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామానికి చెందిన కిరణ్ కుమార్.. సూర్యాపేట, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ గుర్తించింది. సోదాల్లో భాగంగా సుమారు 100 ఎకరాల వ్యవసాయ భూమి, 10 విలువైన ప్లాట్లు, ఐదు ఫోర్ వీలర్ వాహనాలు (కార్లు), ఐదు ట్రాక్టర్లు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. వీటి ప్రభుత్వ విలువ రూ. 15 కోట్లు అని చెబుతున్నప్పటికీ, బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ. 50 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మహబూబ్‌నగర్ ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ వెల్లడించారు.

# మీరు పోలీసింగ్ లో భాగస్వాములవుతారా?

- అయితే.. విద్యార్థులూ ఈ వార్త మీకోసమే!
- హైదరాబాద్ సిటీ పోలసుల వినూత్న ఆలోచన
- ఇంటర్న్ షిప్ కు దరఖాస్తుల ఆహ్వానం
- శిక్షణ తర్వాత సర్టిఫికెట్లు అందజేత

అక్షరదర్బార్, హైదరాబాద్ : హైదరాబాద్ సిటీ పోలీసులు విద్యార్థుల కోసం ఒక అద్భుతమైన అవకాశాన్ని ముందుకు తెచ్చారు. సమాజ రక్షణలో యువతను భాగస్వాములను చేయాలన్న సంకల్పంతో సరికొత్త ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంను ప్రకటించారు. డేటా అనాలసిస్, రీసెర్చ్ ప్రాజెక్టులు, ఆధునిక పోలీసింగ్ విధానాలపై ఈ ఇంటర్న్‌షిప్‌లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. నేరాల విశ్లేషణలో సాంకేతికతను ఎలా వాడాలి, క్షేత్రస్థాయిలో పోలీసింగ్ సవాళ్లను ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై లోతైన అవగాహన కల్పిస్తారు. ఈ ఇంటర్న్‌షిప్ లో భాగస్వాములయ్యేందుకు 25 ఏళ్లలోపు వయసున్న డిగ్రీ, పీజీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్న్‌షిప్ విజయవంతంగా పూర్తి చేసిన వారికి పోలీసు విభాగం నుంచి అధికారిక ధ్రువపత్రాలు అందజేస్తారు. ఎస్ఎమ్ఐటీ సెల్ పర్యవేక్షణలో ఈ శిక్షణ మొత్తం కొనసాగుతుంది. అత్యాధునిక సాంకేతికతతో కూడిన పోలీసింగ్ వ్యవస్థ పని తీరును నేరుగా తెలుసుకునే అవకాశం విద్యార్థులకు లభిస్తుంది. ఆసక్తి గల విద్యార్థులు https://www.hyderabad police.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. కొత్త విషయాలను నేర్చుకోవడంతో పాటు పోలీసు వ్యవస్థతో కలిసి పనిచేయాలనుకునే వారికి ఇది మంచి వేదిక కానుంది.

# 'ఆపరేషన్ కగార్-2'లో వెనకడుగు వేయం

- మార్చి 31 నాటికి మావోయిస్టు విముక్త భారత్
- మరోసారి ఉద్ఘాటించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా



అక్షరదర్బార్, న్యూఢిల్లీ : ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దులోని కర్రెగుట్టల్లో చేపడుతున్న ఆపరేషన్ కగార్–2 విషయంలో ఏమాత్రం వెనకడుగు వేయమని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఉద్ఘాటించారు. అస్సాంలోని గౌహతిలో శనివారం నిర్వహించిన 87వ సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీదఎఫ్) దినోత్సవంలో ఆయన మాట్లాడారు. గతేడాది వేసవిలో 45 డిగ్రీల ఎండలో భద్రతా దళాలు అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించాయని కొనియాడారు. కఠినమైన భౌగోళిక పరిస్థితులు ఉన్నా వెనక్కి తగ్గకుండా 31 మంది మావోయిస్టులను హతమార్చారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లుగా ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశం నుంచి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని పునరుద్ఘాటించారు. దేశాన్ని 'రెడ్ టెర్రర్' నుంచి విముక్తి చేయడంలో సీఆర్పీఎఫ్, కోబ్రా దళాలు కీలక పాత్ర పోషించాయని చెప్పారు. గతంలో 12 రాష్ట్రాల్లోని అనేక జిల్లాల్లో విస్తరించిన నక్సలిజం ఇప్పుడు అంతిమ దశకు చేరుకుందని వివరించారు. కేవలం మూడేళ్ల వ్యవధిలో ఈ క్లిష్టమైన లక్ష్యాన్ని సాధించగలిగామని ధీమా వ్యక్తం చేశారు. జమ్మూకశ్మీర్‌లో ప్రస్తుతం రాళ్లదాడుల ఘటనలు పూర్తిగా ఆగిపోయాయని మంత్రి పేర్కొన్నారు. అంతర్గత భద్రతను కాపాడటంలో భద్రతా దళాల కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో సీఆర్పీఎఫ్ పోషిస్తున్న పాత్రను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు.

# తరగతి గదిలోనే గుండెపోటు..

- బోధిస్తూనే కన్నుమూసిన గురువు
- మహబూబాబాద్ జిల్లాలో విషాదం..
- ఉపాధ్యాయుడు శంకర్ ఆకస్మిక మృతి

అక్షర దర్బార్, మహబూబాబాద్: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువు, పాఠం చెబుతూనే అనంత లోకాలకు వెళ్లిపోయిన ఘటన మహబూబాబాద్ జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపింది. జిల్లాలోని వేమునూరు శివారు ఉత్తర తండాలో శనివారం ఈ హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది.

## పాఠం మధ్యలోనే కుప్పకూలి..



ఉపాధ్యాయుడు శంకర్ ఎప్పటిలాగే శనివారం పాఠశాలకు వచ్చి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. ఈ క్రమంలో ఆయనకు అకస్మాత్తుగా గుండెలో నొప్పి రావడంతో తరగతి గదిలోనే కుప్పకూలిపోయారు. గమనించిన తోటి ఉపాధ్యాయులు వెంటనే స్పందించి ఆయనకు సీపీఆర్ (CPR) చేసి ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేశారు. అయితే, ఫలితం లేకపోవడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. శంకర్ మృతితో విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

# కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలి

**టీఆర్ఆర్ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కిషన్ రావు**

అక్షరదర్బార్, పరకాల: పరకాల డివిజన్‌లో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరకాలలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేస్తే స్థానిక రైతులకు తక్షణ సాంకేతిక సహాయం, పంటలపై శిక్షణ, సమస్యల పరిష్కారం సులభంగా లభిస్తాయని పేర్కొన్నారు.

# కన్నవారిని కాదని..

# కొలువు చేస్తామంటే కుదరదు!

- తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో కోత
- ఏకంగా 10 నుంచి 15 శాతం కట్ చేసి నేరుగా కన్నవారి ఖాతాల్లోకే..
- అస్సాం 'ప్రణామ్' చట్టం తరహాలో తెలంగాణ సర్కార్ సరికొత్త నిర్ణయం
- ఎల్లుండి క్యాబినెట్ భేటీలో ముసాయిదాపై చర్చ.. త్వరలోనే చట్టబద్ధత



అక్షర దర్బార్, హైదరాబాద్: కన్న తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగులకు షాక్ ఇచ్చేలా తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకోబోతోంది. వృద్ధాప్యంలో కన్నవారిని భారంగా భావించి రోడ్డున పడేసే ఉద్యోగుల జీతాల్లో కచ్చితంగా కోత విధించేలా 'పేరెంట్స్ మెయింటెనెన్స్ పాలసీ' కింద కొత్త చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీనిపై ఫిబ్రవరి 23న (సోమవారం) జరగనున్న క్యాబినెట్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు.

## ప్రధాన అంశాలు:

జీతంలో 10–15% కోత: తల్లిదండ్రుల సంరక్షణను విస్మరించినట్లు ఫిర్యాదు అందితే, సదరు ఉద్యోగి జీతంలో 10 నుండి 15 శాతం వరకు కట్ చేసి నేరుగా వారి తల్లిదండ్రుల ఖాతాల్లో వేసేలా నిబంధనలు రూపొందిస్తున్నారు.

కఠిన నిబంధనలు: కేవలం తిండి, గూడు మాత్రమే కాకుండా.. వృద్ధులకు అవసరమైన వైద్య ఖర్చులను కూడా ఈ నిధి నుంచే భర్తీ చేసేలా ఆలోచన చేస్తున్నారు.

**ఎవరికి వర్తిస్తుంది?:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరియు ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే వారందరికీ ఈ చట్టం వర్తిస్తుంది.

## అసలు కారణం ఏమిటి?

ఇటీవలి కాలంలో వృద్ధాశ్రమాల్లో చేరుతున్న వారిలో ప్రభుత్వ ఉద్యోగుల తల్లిదండ్రుల సంఖ్య పెరుగుతోందని నివేదికలు చెబుతున్నాయి. ఉద్యోగాలు ఉండి, ఆర్థికంగా స్థిరపడినప్పటికీ కన్నవారిని పట్టించుకోకపోవడం సామాజిక నేరమని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే అస్సాం వంటి రాష్ట్రాల్లో అమలవుతున్న 'ప్రణామ్' (PRANAM) చట్టం తరహాలోనే దీన్ని ఇక్కడ కూడా అమలు చేయాలని చూస్తున్నారు.

## అమలు ఎలా ఉంటుంది?

బాధితులైన తల్లిదండ్రులు కలెక్టరేట్లలోని గ్రీవెన్స్ సెల్‌లో లేదా సంబంధిత విభాగాధిపతికి ఫిర్యాదు చేయవచ్చు. విచారణలో ఉద్యోగి నిర్లక్ష్యం నిజమని తేలితే, ఆ తదుపరి నెల నుండే జీతంలో కోత పడుతుంది. ఉన్నత స్థాయి అధికారులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీ ఈ ఫిర్యాదులను పరిశీలిస్తుంది. "అమ్మానాన్నలను గౌరవించని చదువులు, సంపాదన వ్యర్థం. ఈ చట్టం కేవలం భయం కోసం కాదు, బాధ్యతను గుర్తు చేయడం కోసం." అని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915